## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మనప్రభుత్వం

వినగడప(గంపలగూడెం): గంపలగూడెం మండలం వినగడప సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. సచివాలయం పరిధిలో శివారు గ్రామాలైన నారికింపాడు, లంబాడీ తండా గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

### 13న బొర్రగూడెం ఆలయ హుండీ కానుకల లెక్కింపు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం బొర్రగూడెంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ గోపయ్య స్వామి దేవస్థానంలోని హుండీ కానుకులను ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో లెక్కించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎస్‌వీ సాంబశివరావు తెలిపారు. కార్యక్రమం ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, గ్రామ పెద్దలు, భక్తులు, హిందూ సేవాదళ సభ్యులు, దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందని పేర్కొన్నారు.

### చిన నాగయ్య పురస్కారాలకు ఎంట్రీల ఆహ్వానం

తిరువూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.చిననాగయ్య స్మారక పురస్కారానికి ఉత్తమ కవితా సంపుటి, ఉత్తమకథా సంపుటి, ఉత్తమ వ్యాస సంపుటి, ఉత్తమ జీవిత చరిత్రవిభాగాల్లో రచయితల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగయ్య మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి ఎం.రాంప్రదీప్ తెలిపారు. ఆగస్టు 31లోగా ఎంట్రీలను ట్రస్టుకు పంపాలని, వివరాలకు 94927 12836లో సంప్రదించాలని కోరారు.

### ఘనంగా రక్షణ సైన్యం ఆవిర్భావ దినోత్సవం



ముసునూరు: ప్రజలను ప్రేమ, శాంతి, రక్షణ మార్గాలలో నడిపేందుకే రక్షణ సైన్యం సంస్థ ఆవిర్భవించినట్లు సంఘ పాస్టర్ కెప్టెన్ ఎం.రాజు పేర్కొన్నారు. ముసునూరుతోపాటు కాట్రేనిపాడు, గోపవరం, పెదపాటివారిగూడెం, వేల్పుచర్లల్లోని రక్షణసైన్యం చర్చిల వద్ద ఆదివారం సంస్థ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముసునూరులో పాస్టర్ రాజు దంపతులు సంఘ సభ్యులతో కలసి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు.

### సమాజానికి మంచి చేసేది గురువ్యవస్థ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజానికి మంచి చేసేది గురువ్యవస్థ అని రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆంధ్రప్రదేశ్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ పుట్టా శేషు చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం గురు పూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పుట్టా శేషు ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. సమాజాన్ని సత్ మార్గంలో నడిపేది గురువులేనన్నారు. మనిషి జీవితంలో గురువు అనే స్థానానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జాతీయ జీవనానికి హిందూ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన పరమ పవిత్ర భగవాధ్వజాన్ని ఆర్‌ఎస్‌ఎస్ శ్రేష్ఠగురువుగా స్వీకరించిందన్నారు. దేశ వైభవానికి నిరంతరం దీక్షాబద్ధులమై తనువు, మనస్సు, ధనము అన్ని తల్లికే సమర్పించే భావనను నిర్మాణం చేసే శుభ తరుణమే గురుపూజోత్సవమని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, బీజేపీ నగర నాయకులు పాల్గొన్నారు.

### అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన వన్నెంరెడ్డి మహేశ్వరికి 2018లో మచిలీపట్నంకు చెందిన రాజేష్‌కు వచ్చి పెద్దలు వివాహం జరిపించారు. తాపీ మేస్త్రీగా పని చేసే రాజేష్ ప్రతి రోజు మద్యం సేవించి వచ్చి భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. అంతే కాకుండా ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ బెట్టింగ్‌లకు పాల్పడటంతో భర్త తీరుపై అత్తకు చెప్పగా ఆమె కూడా కొడుకే వత్తాసు పలికింది. మద్యం, గేమ్స్‌లకు బానిసైన తన భర్త వేధింపులకు గురి చేస్తున్నాడంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అమ్మవారి గుడికి వెళ్లిన తన తల్లి కనిపించడం లేదంటూ కుమారుడు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతంలో తమ్మిన సరస్వతి కుటుంబం నివాసం ఉంటుంది. సరస్వతి ఈ నెల 1వ తేదీ శనివారం అమ్మవారి గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి రాకపోవడంతో ఆమె కుమారుడు దేవీవరప్రసాద్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆరోగ్య సంరక్షణ కేంద్రాలుగా పీహెచ్‌సీలు

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలందిస్తున్నాయి. గతంలో మెరుగైన వైద్యం కోసం పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్ళే మధ్యతరగతి ప్రజలు కూడా గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల లోనే మెరుగైన వైద్య సేవలందుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య, వైద్య రంగాలు కొత్త పుంతలు తొక్కింది. గతంలో చంద్రాల గ్రామంలో పీహెచ్‌సీ ఉండగా దాని పరిధిలో సబ్‌సెంటర్లు ఉండేవి. ఈ సెంటర్లలో అరా కొరా వైద్య సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం సబ్ సెంటర్లను వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా అన్ని సౌకర్యాలతో గ్రామీణ ప్రజల ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలందించే విధంగా తీర్చిదిద్దారు. పీహెచ్‌సీ ద్వారా తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ డాక్టర్ ఆర్. నరేష్ ప్రజలకు ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు. ప్రతి నెలా పీహెచ్‌సీలకు మూడు వేల మంది వైద్య చికిత్సలకు వస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల్లో 14నుంచి 16వేల మంది వరకు చికిత్స కోసం వచ్చినట్లు సిబ్బంది తెలిపారు.



చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం




### ఇద్దరు డాక్టర్ల పర్యవేక్షణ

మైలవరం మండలంలో 16 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, 16 మంది సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎమ్‌లు, సిబ్బంది 50 మంది, ఇతర సిబ్బందితో కలిపి 130మంది వైద్య సేవలందిస్తున్నారు. ఇద్దరు డాక్టర్లు పర్యవేక్షిస్తుంటారు. పీహెచ్‌సీ పరిధిలోని వెల్‌నెస్ సెంటర్లలో 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రక్త, మూత్ర, బీపీ, షుగర్ తదతర 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.



పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నరేష్

### గ్రామీణ ప్రజలకు సేవలు

పీహెచ్‌సీల ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందుతున్నాయి. ప్రస్తుతం సబ్ సెంటర్లను వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లుగా అన్ని హంగులతో మెరుగుపర్చారు. వైఎస్సార్ హెచ్‌వీసీలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందిస్తున్నాయి. సరిపడా సిబ్బంది ఉన్నారు. మరొకో లొకేటెడ్ పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో అనుమతులు కూడా వచ్చే అవకాశం ఉంది. పీహెచ్‌సీలో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది.

– డాక్టర్ ఆర్.నరేష్, చంద్రాల

### పేదలకు వరం



గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ సేవలు పేదలకు వరంగా మారాయి. మధుమేహం, బీపీ, పక్షవాతం, గర్భిణుల నెలవారీ పరీక్షలు తదితర వ్యాధులకు సకాలంలో వైద్యంతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయి. వారానికి ఒకసారి పీహెచ్‌సీ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

– బాణావత్ నాగబాలమ్మ, కిలేశపురం, ఇబ్రహీంపట్నం మండలం

# కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలు

**అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వం**

ఏ.కొండూరు: కిడ్నీ వ్యాధిగ్రస్తులను అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ మండలంలో పర్యటనకు వచ్చినప్పుడు కిడ్నీ వ్యాధిగ్రస్తుల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కె.రక్షణనిధి సహకారంతో ఉచిత వాహన సౌకర్యం, 15 రకాల మందులు ఆర్వో ప్లాంట్లు, ట్యాంకులు ఏర్పాటు చేశారు. కృష్ణాజలాలు సరఫరాతోపాటు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందిస్తూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత నెల రెండో తేదీన నూతనంగా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో వ్యాధిగ్రస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రంలో రోజుకు ఆరుగురికి డయాలసిస్ చేసే వెసులుబాటు కల్పించారు. ఈ మండలంతో పాటు రెడ్డిగూడెం, మైలవరం మండలాల నుంచి వచ్చి కూడా ఈ డయాలసిస్ డయాలసిస్ చేయించుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన వసతులు కల్పిస్తూ డయాలసిస్ చేయించుకుంటున్న వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా రూ. 10వేల పింఛన్ కూడా అందజేస్తున్నారు.



ఏ.కొండూరులోని డయాలసిస్ కేంద్రంలో సేవలందిస్తున్న సిబ్బంది



కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఏర్పాటు చేసిన ఉచిత వాహనం

### ఇబ్బందులు తొలగాయి



ఈ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసిన తర్వాత దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే డయాలసిస్ చేయించుకుంటున్నాం. అన్ని వసతులు ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మా ఇబ్బందులు తొలగాయి.

– వి. రత్నం, జీళ్లకుంట

### అన్ని రకాల మందులు ఇస్తున్నారు



ఈ డయాలసిస్ కేంద్రంలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నా. వాహనంలో తీసుకెళ్లి వైద్యం చేసి ఇంటి వద్దకు తీసుకువెళ్లే వెసులుబాటు కల్పించారు. అవసరమైన అన్ని రకాల మందులు ఇస్తున్నారు.

– ఎస్.నాగలక్ష్మి, రామచంద్రాపురం

### మెరుగైన వైద్యం అందిస్తున్నాం

ఈ డయాలసిస్ కేంద్రం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 102 మందికి డయాలసిస్ చేశాం. ఒక్కొక్కరికి నాలుగు గంటల పాటు వైద్యం చేస్తున్నాం. కొంతమంది వారానికి రెండు, మూడు సార్లు కూడా డయాలసిస్ చేయించుకుంటున్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నాం.

–టి.భరత్‌కుమార్, డయాలసిస్ టెక్నీషియన్

# నేడు 'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే ప్రతాప్

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని వట్టిగుడిపాడులో సోమవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొననున్నట్లు ఎంపీడీఓ పీ శంకరరావు ఆదివారం తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

**నేడు గొల్లపల్లి-2లో ..**

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి-2 సచివాలయ పరిధిలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీఏ విజయకుమార్ ఆదివారం తెలిపారు. తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఈఓపీఆర్డీ టీ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు



తిరువూరు: తిరువూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక చీరాల సెంటర్ వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రైతులకు పవర్ స్ప్రేయర్లు, ఆర్యవైశ్య పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 10 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో లావాదేవీల నిమిత్తం వచ్చే వారి కోసం సిమెంటు బల్లలను విరాళంగా ఇచ్చారు. క్లబ్ ప్రతినిధులు జుజ్జూరు శ్రీనివాసరావు, పెనుపాటి జనార్ధనరావు, రామారావు, రవికుమార్, నరసింహారావు, కృష్ణారావు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### భూకబ్జా యత్నంపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నంలో భూకబ్జాకు ప్రయత్నించిన వ్యక్తిపై ఇబ్రహీంపట్నం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన కరీమున్నీసాకు తన భర్త షేక్ మీరాహుస్సేన్ ద్వారా గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన భూమిలో కుటుంబ వివాదాల నేపథ్యంలో ఆమె సమీప బంధువు మదార్ అనే వ్యక్తి కబ్జాకు ప్రయత్నించి సిమెంట్ పోల్స్ పాతాడు. ఈ విషయంపై కరీమున్నీసా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన సీఐ పి.శ్రీను మదార్‌తో పాటు అతని కుమారినిపై కేసు నమోదుచేశారు.

### విధి నిర్వహణలో మన్ననలు పొందాలి

చాట్రాయి: విధి నిర్వహణలో ప్రజల మన్ననలను పొందాలని మండలంలోని పోలవరం పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ పేర్కొన్నారు. పీహెచ్‌సీ హెచ్‌వీ నిర్మల బదిలీ అయిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# పాలకేంద్రం ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం

నూజివీడు: మండలంలోని సీతారామపురంలో ఉన్న పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘానికి(పాలకేంద్రం) రెండు రోజుల క్రితం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. అధ్యక్షుడిగా పర్వతనేని రమేష్, డైరెక్టర్లుగా కన్నిగంటి బోసు, యలమంచిలి కిషోర్, కన్నిగంటి సత్యనారాయణ, కన్నిగంటి విమలమ్మ, పాగోలు లిల్లా గెలుపొందారు. పాలకేంద్రం ఏర్పాటైన 40 ఏళ్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు చరిత్రను తిరగరాశారు. ఎన్నికైన వారిని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కవులూరి యోగేశ్వరరావు, నాయకులు కన్నిగంటి సురేష్, తుమ్మల సత్యనారాయణ, శివరామకృష్ణ, శ్రీనివాసరావు, పర్వతనేని కృష్ణబాబు, కనకయ్య అభినందించారు.




సీతారామపురం పాలకేంద్రం అధ్యక్షుడిగా ఎన్నికైన రమేష్‌ను అభినందిస్తున్న కవులూరి యోగి

# ప్రత్యేక పూజలు

పెనుగొలను(గంపలగూడెం): ఆషాఢ మాసం సందర్భంగా పెనుగొలను శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి ఆదివారం ప్రత్యేక అర్చనలు చేశారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి, వివిధ రకాల పండ్లు, కాయలు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి అలంకరణ చేశారు. అర్చకులు డీ రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

**ముత్యాలమ్మవారికి శాకంబరి అలంకరణ**

గంపలగూడెం: గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా గ్రామదేవతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో భక్తులు అభిషేకం కనులవిందుగా జరిపారు. నూతన వస్త్రాలు ఆభరణాలు, వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.



పార్వతీదేవికి శాకంబరి అలంకరణ



ముత్యాలమ్మ వారికి శాకంబరి అలంకరణ

# మీటింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

ఏ.కొండూరు: స్థానిక మత్రీయ తండా పంచాయతీ పరిధిలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆదివారం మీటింగ్ హాల్ నిర్మాణానికి విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ ఆశ్రమ పాఠశాలలో నూతన మీటింగ్ హాల్ నిర్మాణానికి రూ.95 లక్షలు కేటాయించామన్నారు. ప్రభుత్వాలు అందజేస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్ భూక్య, హెచ్‌ఎం టి.పుల్లారెడ్డి, ఝూన్సీ పాల్గొన్నారు.



మీటింగ్ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కేశినేని నాని

# ప్రభాకర్ సేవలు అమూల్యం

తిరువూరు: పేదల సమస్యల పరిష్కారానికి సీపీఎం సీనియర్ నేత మరసకట్ల ప్రభాకరరావు విశేష కృషిచేశారని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ప్రభాకరరావు సంతాపసభ స్థానిక సుందరయ్యభవన్లో ఆదివారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం, కులవివక్ష పోరాట సమితి తదితర ప్రజాసంఘాల్లో ప్రభాకరరావు క్రియాశీలక పాత్ర పోషించారని కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తులసీరావు, మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు, బార్ అసోసియేషన్ చైర్మన్ సంకురాత్రి జనార్దనరావు, నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, సీపీఐ నాయకులు తూము కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లె పాటి శ్రీనివాసరావు, రైతుసంఘ నాయకులు ఎస్ నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చలమాల సత్యనారాయణ, సీపీఎం మండల కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ తదితరులు ప్రభాకరరావు మృతికి సంతాపం తెలిపారు.



సీపీఎం నేత ప్రభాకరరావు సంతాపసభలో నాయకులు

### నేటినుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

తిరువూరు: విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మండలంలోని ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యావిధానంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో బోధన, ఈ కంటెంట్, బైజూస్ యాప్ వినియోగం, స్మార్ట్ టీవీతో పాఠ్యాంశాల బోధన తదితర అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 3, 4 తేదీలలో మొదటి బ్యాచ్, 14, 15 తేదీల్లో రెండో బ్యాచ్ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

### వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మార్కింగ్

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామంలో నూతనంగా నిర్మించే వాటర్ ట్యాంక్‌కు ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.60 లక్షల వ్యయంతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సి.ప్రసాదరావు ఏఈ సత్యప్రసాదు, ఉప సర్పంచ్ దిరిశాల చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వనమా వాసు, విస్సంపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

### నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమల్లో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

**నూజివీడులో 'స్పందన' రద్దు**

నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున స్పందనను నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ఎవరికైనా సమస్యలుంటే వారి మండలాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని, అక్కడ అర్జీలు అందజేయవచ్చని సబ్ కలెక్టర్ విజ్ఞపి చేశారు.

# 'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

**సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**

ముసునూరు: మండల వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పథకం మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. మండలంలో తొలిసారిగా జగనన్న సురక్ష క్యాంప్‌లు ప్రారంభం కానున్న లోపూడి, సూరేపల్లిలో అధికారులతో కలసి ఆదివారం ఆయన పర్యటించారు. కార్యక్రమ నిర్వహణకు అధికారులు, సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ దాసరి సుధ, డీటీ ఎమిలీ కుమారి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

**'జగనన్న సురక్ష' శిబిరానికి సన్నద్ధం కావాలి**

చాట్రాయి: జగనన్న సురక్ష శిబిరానికి అధికారులు సన్నద్ధం కావాలని తహసీల్దార్ విశ్వనాథరావు అన్నారు. మండలంలోని చనుబండ గ్రామ సచివాలయాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న సచివాలయం-1లో జగనన్న సురక్ష శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి స్వీకరించిన వినతులను శిబిరంలో పరిష్కరించి కుల, జనన మరణ, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, ఈఓపీఆర్‌డీ నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లోపూడిలో జగనన్న సురక్ష సర్వేపై మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథరావు

# 'ఈ నగరానికి ఏమైంది' రీ రిలీజ్‌కు మంచి స్పందన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నగరానికి ఏమైంది చిత్రం రీ రిలీజ్ చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆ సినిమా దర్శకుడు తరుణ్‌భాస్కర్ అన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రతి ప్రేక్షకునికి ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం ఆ చిత్ర యూనిట్ సభ్యులు నగరానికి విచ్చేశారు. బెంజిసర్కిల్‌లోని క్యాపిటల్ సినిమాస్‌లో మీడియాతో మాట్లాడారు. గోవా ట్రిప్‌కు వెళ్లే నలుగురు చిన్ననాటి స్నేహితుల ఆధారంగా ఈ నగరానికి ఏమైంది చిత్రాన్ని నిర్మించి 2018 జూన్‌లో రిలీజ్ చేశామన్నారు. అప్పట్లో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. మళ్లీ ఒకటి, రెండు రోజుల ప్రదర్శిద్దామని రీ రిలీజ్ చేశామని, కానీ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుండటంతో ప్రదర్శన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సురేష్ మూవీస్ జిల్లా మేనేజర్ ఎంవీఎస్ భగవాన్, క్యాపిటల్ సినిమాస్ మేనేజర్ కిషోర్, చిత్ర నిర్మాతలు వివేక్, సాయికృష్ణ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న దర్శకుడు తరుణ్ భాస్కర్, పక్కన నిర్మాతలు వివేక్, సాయికృష్ణ

### నూజివీడు ఎంఈఓ-1గా సేవియా

నూజివీడు: నూజివీడు ఎంఈఓ-1గా ఇన్‌చార్జి డీవైఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.సేవియా నియమితులయ్యారు. ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన నూజివీడు మండలం ఎంఈఓ-1గా ఎంపిక చేసుకోవడంతో ఆర్జేడీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.